క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని దేవరపల్లి సెక్షన్ పరిధిలోని గౌరీపట్నం శివారు కొండగూడెంలో ఆర్‌డీఎస్ పనులు జరుగుతున్నందున శనివారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఆపరేషన్ ఈఈ ఎస్. నారాయణ అప్పారావు తెలిపారు. 33/11 కేవీ దేచర్ల సబ్ స్టేషన్ నుంచి 11 కేవీ గౌరీపట్నం ఫీడర్‌లో సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

నిడదవోలు రూరల్: బాల్య వివాహాలపై కిశోర బాలికలు అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్ లక్ష్మి అన్నారు. మండలంలోని తాళ్లపాలెం, సింగవరం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే అనర్థాలు, రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది కల్యాణి, ఇందిరా, సుజాత, రత్నశ్రీ,, పద్మ, లిల్లీపుష్ప, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

గోపాలపురం: గోపాలపురం మండలంలోని గోపాలపురం, కోమటికుంట గ్రామాల్లో దాడులు నిర్వహించి వెయ్యి లీటర్ల బెల్లపు ఊట, 10లీటర్ల నాటు సారా పట్టుకున్నట్లు దేవరపల్లి ఎక్సైజ్ సీఐ బి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. గోపాలపురం మండలం కోమటికుంటలో నాటుసారా తయారు చేస్తున్న చుక్కా సుబ్బారావు బట్టీలపై దాడులు నిర్వహించి వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. గోపాలపురం గ్రామంలో నాటుసారా అమ్మకాలు సాగిస్తున్న గుబ్బల శ్రీను వద్ద నుంచి 10లీటర్ల సారా స్వాధీనం చేసుకొని కోమటికుంటకు చెందిన చుక్కా సుబ్బారావు, గుబ్బల శ్రీనులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. బెల్ట్ షాపులు నిర్వహించినా, నాటు సారా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

వైభవంగా పాశాలమ్మతల్లి జాతర


ఏటిగట్టు రోడ్డుపై ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

తాళ్లపూడి(కొవ్వూరు): మండలంలోని ఆరికిరేవుల గ్రామదేవత పాశాలమ్మతల్లి జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా గ్రామంలో ఎక్కడ చూసినా సందడి వాతావరణం నెలకొంది. దీనిలో భాగంగా గరగ నృత్యాలు, గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బాణాసంచా పేలుళ్లు ఆకట్టుకుంది. గ్రామంలోని ప్రధాన వీధులతో పాటు ఏటిగట్టుపై విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన సెట్టింగులు మిరుమిట్లు గొలిపాయి.

ఉచిత స్పోకెన్ ఇంగ్లిషు క్లాసుల ఏర్పాటు

నల్లజర్ల: రుషి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రకాశరావుపాలెం పద్మోదయ ఫంక్షన్ హాలులో 8,9,10 తరగతుల విద్యార్థులకు ఉచిత స్పోకెన్ ఇంగ్లిషు క్లాసులు ఏర్పాటు చేసినట్టు ట్రస్టు కార్యదర్శి చిక్కా సోమేశ్వరావు తెలిపారు. పరిసర గ్రామాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 98408 91197ను సంప్రదించాలన్నారు.

మృతుని కుటుంబానికి పరిహారం

తాళ్లపూడి: మండలంలోని తుపాకులగూడెం గ్రామానికి చెందిన పాడి రైతు గుల్లపూడి వీర వెంకట సత్యనారాయణ ప్రమాదం బారిన పడి మృతి చెందిన సంఘటన నేపథ్యంలో మృతుని కుటుంబ సభ్యులకు ఏపీఈపీడీసీఎల్ నుంచి మంజూరైన రూ.ఐదు లక్షల చెక్కును శుక్రవారం అందజేశారు. కొవ్వూరు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చేతులు మీదుగా బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమని రామకృష్ణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రహదారికి తాత్కాలిక మరమ్మతులు

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంకలోని ఆర్ అండ్‌బీ రోడ్డు వద్ద డ్రెయిన్ తూర వద్ద గోతులు పడడంతో తలెత్తిన సమస్యను పరిష్కరించి వాహన దారులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి ఊబా నందిరాజు అన్నారు. తాళ్లపూడి నుంచి ప్రక్కిలంక మీదుగా వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు వద్ద రోడ్డు సక్రమంగా లేక వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు. వర్షం నీరు నిలిచిపోవడంతో పాటు గోయ్యి ఏర్పడింది. ఈ క్రమంలో సర్పంచ్ యాళ్ల స్వప్న ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ దళిత జేఏసీ కన్వీనర్ యాళ్ల బాబూరావు, పంచాయతీ కార్యదర్శి చర్యలు చేపట్టారు. ఈ ప్రాంతంలో తన సొంత ఖర్చుతో తాత్కాలికంగా రోడ్డు వేయడం జరుగుతుందని బాబురావు తెలిపారు.


అజ్జరం వద్ద నరసాపురం కాలువ గట్టుపై వేసిన చెత్త


ముక్కామల వద్ద నక్కల కాలువ గట్టు పరిస్థితి


ఖండవల్లి వద్ద చెత్తా చెదారంతో పూడ్చివేసిన కాలువ

పెంట కాలువలు..!

- చెత్తా చెదారంతో నిండిపోతున్న కాలువ గట్లు
- కలుషితమవుతున్న తాగు, సాగునీరు
- అనారోగ్యం పాలవుతున్న ప్రజలు
- అధికారుల ఉదాసీనతతో అవస్థలు

పెరవలి: ఉమ్మడి గోదావరి జిల్లాల్లో లక్షలాది మందికి తాగునీరు, లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే ప్రధాన కాలువ గట్లు డంపింగ్ యార్డులుగా దర్శమిస్తున్నాయి. కాలువలను ఆనుకుని ఉండే గ్రామాల నుంచి సేకరించిన చెత్తా చెదారాన్ని తీసుకువచ్చి కాలువ గట్లపై వేయటంతో స్వచ్ఛమైన జలాలు కలుషితం అవ్వటంతో వాటిని వినియోగించే రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెరవలి మండలంలో ప్రధాన పంట కాలువలైన కాకరపర్రు కెనాల్, బ్యాంక్ కెనాల్, నక్కల కాలువ, నిడదవోలు-నరసాపురం కాలువలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ కాలువలపై లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించవలసి ఉండగా చెత్తా చెదారం కారణంగా స్వచ్ఛమైన జలాలు సజావుగా దిగువకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. పెరవలి మండలంలో కాకరపర్రు కెనాల్‌పై ఉసులుమర్రు, తీపర్రు వద్ద, నరసాపురం కెనాల్‌పై పెరవలి, కాపవరం గ్రామాల్లోనూ, నక్కల కాలువపై ముక్కామల, నల్లాకులవారిపాలెం, ఖండవల్లి గ్రామాల వద్ద, బ్యాంక్ కెనాల్‌పై కాకరపర్రు, మల్లేశ్వరం గ్రామాల వద్ద చెత్తా చెదారం గట్లపై వేయటంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 15 ఏళ్ల క్రితం ఈ గట్లపై రాత్రి పగలు తేడా లేకుండా పడవలు నడిపేవారు. ప్రజలు యథేచ్ఛగా రాకపోకలు సాగించేవారు. కాలక్రమేణా జల రవాణా లేకపోవటంతో రైతులు గట్లను కొద్దికొద్దిగా తొలచి చేలుగా మలిచి వేయటంతో కాల్వగట్లు కుచించుకుపోయాయి. మరోవైపు గ్రామ పంచాయతీలు గ్రామాల్లో పోగుచేసిన చెత్తా చెదారాలను తీసుకువచ్చి గట్టపైనే వేస్తున్నారు. దీనితో ఈ జలాలు కలుషితం అవ్వటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నరసాపురం కాలువ పెరవలి మండలంలో 6 కిలోమీటర్ల మేర ప్రవహిస్తూ దిగువన పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు వరకు సుమారు 50 కిలోమీటర్ల మేర వెళుతుంది. బ్యాంక్ కెనాల్ మండలంలో 15 కిలోమీటర్లు ప్రయాణించి దిగువకు లక్ష్మీపురం వరకు సుమారు 40 కిలోమీటర్ల మేర ప్రయాణిస్తుంది. కాకరపర్రు కెనాల్ 13 కిలోమీటర్ల ప్రయాణించి దిగువకు 53 కిలోమీటర్ల మేర నరసాపురం వరకు ప్రయాణిస్తుంది. నక్కల కాలువ మండలంలో 15 కిలోమీటర్ల మేర ప్రయాణించి దిగువకు 45 కిలోమీటర్లు మేర నరసాపురం వరకు ప్రయాణించి సముద్రంలో కలుస్తుంది.

జలాలు కలుషితం

కాలువ గట్లు డంపింగ్ యార్డులుగా మారిపోవటానికి అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణంగా పరిణమిస్తోంది. రోడ్ల ప్రక్కన వేసిన చెత్తాచెదారం గుట్టల్లా మారిపోవటంతో రాకపోకలు సాగించటానికి తీవ్ర అవస్థలు పడాల్సి వస్తున్నదని రైతులు వాపోతున్నారు. కాలువ గట్లపై వేసిన చెత్తా చెదారం పెరిగినప్పుడల్లా ఆయా గ్రామాల వారు తగులబెట్టి వాటిని కాలువలోకి వేయటంతో జలాలు కలుషితం అవుతున్నాయి. అంతేకాక ఈ కాలువ గట్లపైనే చనిపోయిన గేదెలు, మేకల వ్యర్థాలను వేస్తున్నారు. దీనితో నీరు కలుషితమై ప్రజలు అనారోగ్యానికి గురి అవుతున్నారు. డెల్టాలో త్రాగునీటికి ఇబ్బందులు లేకపోయినా దిగువన ఉన్న మండలాలు మొగల్తూరు, నరసాపురం, లక్ష్మీపురం, ఆచంట, పోడూరు వంటి మండలాలకు తాగునీరు ఈ కాలువల ద్వారానే వినియోగిస్తున్నారు. ఈ జలాలు కలుషితం అవ్వటంతో ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలై ఇబ్బందులు పడుతున్నారు.

పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం

కాల్వగట్లపై చెత్తా చెదారం వేయకుండా నిలువరించాల్సిన పంచాయతీ అధికారులు కంచె చేను మేసినట్లు వారే చెత్తా చెదారం వేయటం దారుణం. చెత్తా చెదారం వేసే గ్రామాల్లో డంపింగ్ యార్డులు (సంపద కేంద్రాలు) ఉన్నా వాటిని ఉపయోగించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పరిస్థితి ఇలానే ఉంటే మరో ఏడాదిలో కాలువలే మృగ్యమయ్యే దుస్థితి దాపురించే ప్రమాదముందని పలువురు వాపోతున్నారు.


తీపర్రు వద్ద కాకరపర్రు కాలువ గట్టుపై వేస్తున్న చెత్త

నోటీసులు ఇస్తున్నాం..



కాలువ గట్లపై చెత్తా చెదారం వేస్తున్న పంచాయతీలకు నోటీసులు ఇచ్చాం. చెత్తా చెదారాన్ని తొలగించి మరోసారి వేయకుండా చర్యలు తీసుకోవాలని నోటీసులో పొందుపరిచాం.

బాల మురళీకృష్ణ, ఇరిగేషన్ ఏఈ, పెరవలి.

ఈ నెల 21 వరకు రైల్వే గేటు మూసివేత


మూసి ఉన్న దారవరం రైల్వేగేటు

చాగల్లు: మండలంలోని దారవరం రైల్వేగేటును ఈ నెల 21 వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. గేటు వద్ద ట్రాక్ మరమ్మతులు చేయడంతో పాటు ట్రాక్ మధ్యలో ఉన్న కాంక్రీటు దిమ్మలు కొత్తవి ఏర్పాటు చేసే ప్రక్రియలో భాగంగా గేటును మూసివేశారు. గేటు మూసి వేయడంతో శుక్రవారం దారవరం, మార్కొండపాడు, బ్రాహ్మణగూడెం తదితర గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

యర్నగూడెం మాజీ సర్పంచి మృతి


గుమ్మడి ప్రసాదరావు(ఫైల్)

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గుమ్మడి ప్రసాదరావు(70) అనారోగ్యంతో ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా సుదీర్ఘకాలం పని చేశారు. మండల లిట్రసీ అధికారిగా పనిచేసి పలుమార్లు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఉద్యోగ విరమణ అనంతరం గ్రామ సర్పంచ్‌గా పనిచేసి గ్రామాభివృద్ధికి కృషి చేశారు. భార్యాభర్తలు ఇరువురు గ్రామ సర్పంచ్‌లుగా దశాబ్ద కాలం పనిచేశారు. గుమ్మడి ప్రసాదరావు మృతి పట్ల పలువురు ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర


అమ్మవారికి ఊరేగింపుగా సారె తీసుకువెళుతున్న మహిళలు

పెరవలి: ఖండవల్లిలో వేంచేసియున్న ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. గత 10 రోజులుగా జాతర ఉత్సవాలు జరుపుతున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం అమ్మవారికి చీర, సారె సమర్పించారు. వేలాది మంది మహిళలు పుట్టింటి నుంచి సారెను పట్టుకుని ఊరేగింపుగా గ్రామ పురవీధుల్లో తిరుగుతూ ఆలయానికి వెళ్లి అమ్మవారికి సమర్పించారు. 5 ఏళ్లకు ఓసారి ఈ జాతర మహోత్సవాన్ని నిర్వహిస్తుండడం పరిపాటిగా మారింది. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు జాతరలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇసుక రవాణాదారులు నిబంధనలు పాటించాలి


బోట్స్‌మెన్ ప్రతినిధులతో చర్చిస్తున్న అధికారులు

తాళ్లపూడి: గోదావరి ఏటిగట్టు రోడ్డుపై ఇసుక పడకుండా, ప్రమాదాలు జరగకుండా ర్యాంపు నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ మోహన భారతి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బోట్స్‌మెన్ సొసైటీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి తహసీల్దార్ మోహన భారతి, ఎస్సై రామకృష్ణలు మాట్లాడుతూ మండలం లోని ఏటి గట్టు రోడ్డు పక్కన నిత్యం తిరిగే ఇసుక లారీల ద్వారా జారీ పడుతున్న ఇసుక వల్ల జరిగే ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇసుక ఎక్కువగా ఆర్అండ్‌బీ రోడ్ల పై పేరుకుపోతున్న ముఖ్య కూడలిలో స్పీడ్ బ్రేకర్లు వేయించినా ప్రమాదాలు సంభవిస్తున్నందున బోట్సమెన్ సొసైటీ వారితో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతి ర్యాంపు వద్ద హెచ్చరిక బోర్డులు, ఇసుక తరలించే వాహనాలపై బరకాలు కప్పటం, రీచ్‌కి వెళ్లే దారుల్లో మిర్రర్‌లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలని బోట్స్‌మెన్ సొసైటీలకు సూచించారు. సమావేశంలో ఆర్ఐ కె రామకృష్ణ, బోట్సమెన్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కర్మాగారాల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

- కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత


పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

తాళ్లపూడి(కొవ్వూరు): కర్మాగారాల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత స్పష్టం చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఫ్యాక్టరీ విభాగం ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలో ఉన్న పలు పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశ్రమల నిర్వహణలో భద్రతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల్లో కొన్ని నిర్దేశిత మార్గదర్శకాలను అనుసరించి తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ప్రమాదకర వ్యర్థాలు విడుదల చేసే పరిశ్రమలలో విధిగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆయా పరిశ్రమలలో అలారింగ్, సెన్సార్ పరికరాలు ఖచ్చితంగా పనిచేసేలా చూడాలన్నారు. జిల్లా స్థాయిలో ఏడు శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ పరిశ్రమ నిర్వాహకులు ప్రమాణాలు ఖచ్చితంగా పాటిస్తున్నారో లేదో తనిఖీ నిర్వహిస్తారని తెలిపారు. పరిశ్రమల నిర్వాహకులు వినియోగిస్తున్న రసాయనాలు, వాటి పరిమాణామాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాక్ డ్రిల్, కమిటీ సమావేశాలు తదితర అంశాలపై అవగాహన కల్పించడం కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఫ్యాక్టరీ తనిఖీ అధికారి స్వాతి, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, ఆంధ్రా షుగర్స్ లిమిటెడ్, భాగ్య నగర్ క్లోయిడ్, సగ్గొండ, విజన్ డ్రగ్స్, త్రివేణి తదితర కర్మాగారాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కొవ్వూరు లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆర్డీవో రాణి సుస్మిత తనిఖీ చేశారు. వేసవి కాలంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందజేస్తున్న వివిధ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా పిల్లల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పీహెచ్‌సీకి అనుబంధంగా ల్యాబ్ నిర్మాణం

నల్లజర్ల: స్థానిక పీహెచ్‌సీ చెంతనే వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో రూ.50 లక్షలతో ప్రత్యేక ల్యాబ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఎన్ఆర్‌హెచ్ఎం, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షలతో భవన నిర్మాణం పూర్తయ్యాక ఆధునిక ల్యాబ్ ఎక్విప్‌మెంట్ అందుబాటులోకి రానున్నది. గతంలో గర్భిణీ స్త్రీలు స్కానింగ్ కోసం వ్యయ ప్రయాసలకు ఓర్చి తాడేపల్లిగూడెం, తణుకు తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ బాధ లేకుండా అధునాతన వసతులతో ఇక్కడే వైద్య పరీక్షలను నిర్వహిస్తారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే దీనికి గానూ నిధులు కేటాయించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1400 ల్యాబ్ భవనాలు ఏర్పాటు కానుండగా నల్లజర్ల, ఉండ్రాజవరం, మలకపల్లి పీహెచ్‌సీలలో ఈ భవనాలు మంజూరయ్యాయి.

కిశోర బాలికలు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

గోపాలపురం: కిశోర బాలికలు యుక్త వయస్సులో ఆరోగ్యంగా ఉండాలని గోపాలపురం సీడీపీఓ నాగలక్ష్మి అన్నారు. స్థానిక జేబీ పాఠశాల వద్ద శుక్రవారం కిశోర వికాసంలో భాగంగా బాలికలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని కిశోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యుక్త వయస్సులో రక్త హీనత లేకుండా ఉండాలంటే ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, చైల్డ్ వెల్‌ఫేర్ కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ పోటీలకు చాగల్లు విద్యార్థుల ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

చాగల్లు: ఈ నెల 17,18 తేదీల్లో నెల్లూరు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ పోటీలకు చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 20 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల పీడీ జె.విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఈ నెల 15వ తేదీన జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. వీరిలో 12 మంది బాలికలు, 8 మంది బాలురు ఉన్నారని తెలిపారు.

అప్రమత్తతతో డెంగీ దూరం


ఉండ్రాజవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

నల్లజర్ల: డెంగీ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోతవరం పీహెచ్‌సీ వైద్యుడు రాజశేఖర్ సూచించారు. ప్రపంచ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పోతవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యులు రాజశేఖర్ మాట్లాడుతూ ఇళ్లలో ఎక్కువ రోజులు నీటిని నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో వినియోగించకుండా ఉన్న పాత సామాగ్రి దోమలకు ఆవాసాలుగా మారతాయని వాటిని తొలగించాలన్నారు. తాగిపడేసిన కొబ్బరి బొండాలు, పాతటైర్లు, నీటితొట్టిలో వర్షం నీరు నిల్వ ఉండటం వల్ల డెంగీ దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల గురించి వివరించారు. ప్రతి శుక్రవారం విధిగా డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జయప్రకాష్, సత్యం, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీ నిర్మూలకు అవగాహన ర్యాలీ

తాళ్లపూడి : దోమకాటు ద్వారా డెంగీ వ్యాధి సోకుతుందని వైద్యాధికారి హారిక గుప్తా తెలిపారు. తాళ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్యాధికారి హారిక గుప్తా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగీ వ్యాధి గురించి అవగాహన కల్పించారు. సీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండి దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నియంత్రణతో వ్యాధులు దూరం

ఉండ్రాజవరం: దోమల నియంత్రణతో వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చని ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యులు రాజనాల ప్రసాద్ తెలిపారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ఉండ్రాజవరం గ్రామంలో శుక్రవారం అవగాహన సదస్సుతో పాటు ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలలో అవసరం లేని నీటి నిల్వలు లేకుండా చూడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ కుమారి, ఫార్మసిస్ట్ శ్రీదేవి, ఎస్టీఎస్ ఆశా జ్యోతి, స్టాఫ్ నర్స్ జ్యోతి, ఆరోగ్య, ఆశా సిబ్బంది పాల్గొన్నారు. వేలివెన్ను పీహెచ్‌సీ పరిధిలో వైద్యులు ఇర్ఫాన్, సృజన ఆధ్వర్యంలో వేలివెన్ను గ్రామంలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుభాషిణి, ఏఎన్ఎం సునీత, భాగ్యలక్ష్మి, పర్వీన్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

డెంగీ నిర్మూలనే ధ్యేయం

దేవరపల్లి: టైగర్ దోమ వల్ల డెంగీ వ్యాధి ప్రబలుతుందని గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి జె.సతీష్ తెలిపారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రామంలో డెంగీ వాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు ఇంటి లోపల, ఆవరణలో ఉంటాయని, ఈ దోమ పగటిపూట కుడుతుందని తెలిపారు. డెంగీ వ్యాధి లక్షణాలను ఆయన ప్రజలకు వివరించారు. ఈ వ్యాధి బారిన పడకుండా మనలను మనం కాపాడుకోవాలని వైద్యాధికారి డాక్టర్ సతీష్ తెలిపారు. ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ శ్రీకృష్ణుడు, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్ఎన్‌వీ సత్యనారాయణ, సీహెచ్ రాజు, టి.సుకుమార్, ఆరోగ్య సహాయకులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


డెంగీ నివారణకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


తాళ్లపూడి పీహెచ్‌సీ వద్ద అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


గౌరీపట్నంలో ఉపాధి కూలీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారి సతీష్